క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ పృథ్వీ

మధిర: పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యుడు పృథ్వీ తెలిపారు. మండలంలోని రాయపట్నం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ తల్లి పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు వరకు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలను వేయించాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది గోలి రమాదేవి, జయమ్మ, విజయకుమారి, ఆశ కార్యకర్తలు నానమ్మ, విజయలక్ష్మి, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు మద్దతు



దీక్షా శిబిరం వద్ద మద్దతు తెలుపుతున్న ప్రజాపంథా నాయకులు

కల్లూరు: కల్లూరులో డబుల్‌బెడ్ రూం గృహాల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా పలువురు లబ్ధిదారులు 18 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. వీరికి శనివారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకుడు వెంకన్న, కల్లూరు పట్టణ కార్యదర్శి మల్యాద్రి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఖమ్మంపాటి పుల్లారావులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అధికారులు స్పందించి లబ్ధిదారులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

శివాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష చెక్కును అందజేస్తున్న పరశురామ్

చింతకాని: మండలంలోని బస్వాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి గ్రామానికి చెందిన ఆవుల సుబ్బయ్య మనుమడు పరశురామ్ రూ.లక్ష విరాళాన్ని శనివారం గ్రామసర్పంచ్ రాసాల మోహన్‌రావుకు అందజేశాడు. ఈ సందర్భంగా పరశురామ్‌ను ఆలయ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మార్గం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బోనకల్: ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టే హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను జయప్రదం చేయాలని మండల ఇన్‌చార్జ్ పులిబండ్ల చిట్టిబాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పాదయాత్రకు సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టేందుకు భట్టి విక్రమార్క చేపట్టే పాదయాత్రలో యువకులు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, కర్నాటి కోటి, వైస్ ఎంపీపీ రమేష్, ప్రేమ్‌కుమార్, సుందర్‌రావు, తిరుపతిరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు

మధిర: మండలంలోని మాటూరు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మాటూరుకు చెందిన రాయబారం పుల్లయ్య శనివారం మధిర నుంచి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మధిర నుంచి గోసవీడు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పుల్లయ్యను ఖమ్మం తరలించగా, పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దశాబ్దాల కల సాకారమైంది..

- తాటిపూడి – ముసలిమడుగు వయా కొండకొడిమ రోడ్డు
- నిర్మాణానికి రూ.4.30 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రోడ్డును చదును చేయిస్తున్న దృశ్యం



ముసలిమడుగు - నూతన ముసలిమడుగు గ్రామాల మధ్య కొనసాగుతున్న లింకు రోడ్డు పనులు

వైరారూరల్: దశాబ్దాల నాటి కల నెరవేరింది. ప్రజల ఉపయోగంగా ఉండే రోడ్డు సౌకర్యం కోసం చాలా కాలంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. మండలంలోని తాటిపూడి – ముసలిమడుగు వయా కొండకొడిమ గ్రామాల మధ్యలో ఆర్అండ్‌బీ పరిధిలోని లింకు రోడ్డు నిర్మాణానికి రూ.4.30 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు పనుల్లో జాప్యం చేయకుండా త్వరితగతిన బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు..

మండలంలోని తాటిపూడి – ముసలిమడుగు వయా కొండకొడిమ గ్రామాల మధ్యలోని లింకు రోడ్డు బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు 2 బిట్లుగా రెన్యూవల్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ముసలిమడుగు నుంచి నూతన ముసలిమడుగులోని ఎస్టీ గురుకుల పాఠశాల/కళాశాల వరకు సుమారు రెండున్నర కిలో మీటర్ల మేర రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. ముసలిమడుగు నుంచి కొండకొడిమ గ్రామాల మధ్యలో సుమారు 1.8 కిలో మీటర్ల మేర రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిర్మించనున్నారు. మొత్తంగా రూ.4.30 కోట్ల నిధులు మంజూరు కాగా ఇరు గ్రామాలకు అనుసంధానంగా 6 కల్వర్టులు నిర్మించనున్నారు. కాగా ముసలిమడుగు – కొండకొడిమ గ్రామాల మధ్యలో మొత్తం రెండున్నర కిలో మీటర్లకు గాను 1.8 కిలో మీటర్ల మేర అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరయ్యాయి. మరో అర కిలో మీటర్ మేర రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కావాల్సి ఉంది.

పనులు ప్రారంభం..

లింకు రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రెన్యూవల్ నిధులను మంజూరు చేయడంతో ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఇరు గ్రామాల మధ్యలో రహదారికి ఇరువైపులా పెరిగిన పలు రకాల చెట్లను తొలగించడమే కాకుండా గతుకులతో అధ్వానంగా ఉన్న రోడ్డుపై గ్రావెల్ తొలిగించి చదును చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరో 15 రోజుల్లో పూర్తి స్థాయి బీటీ రోడ్డు పనులను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని ప్రజలు తెలుపుతున్నారు.

తాటిపూడి – ముసలిమడుగు రోడ్డు అభివృద్ధికి నిధులెన్నడో..

మండలంలోని తాటిపూడి – నూతన ముసలిమడుగు వరకు సుమారు 3 కిలో మీటర్ల మేర ఉన్న లింక్ రోడ్డు ఆర్అండ్‌బీ పరిధిలో ఉంది. నూతన ముసలిమడుగులో ఎస్టీ గురుకులం పాఠశాల/కళాశాల ఉంటుంది. ఈ దారి వర్షాకాలంలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి అంతే కాకుండా నిత్యం విద్యార్థినులకు నిత్యావసర సరుకులు తీసుకెళ్లే ఆటోవాలాలు ఈ మార్గంలోనే వెళ్లాలి. కావున ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

మా కల సాకారమైంది..



ముసలిముడుగు నుంచి కొండకొడిమ గ్రామాల మధ్యలో పంట పొలాలు ఉన్నాయి. వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలంటే సరైన మార్గం లేక అనేక ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు లింక్ రోడ్డుకు నిధులు మంజూరైన నేపథ్యంలో మా ఇబ్బందులు తీరనున్నాయి. ఎన్నో ఎళ్ల మా కల సాకారమైంది.

– నర్వనేని గోపాలరావు, ముసలిమడుగు

త్వరితగతిన పూర్తి చేయాలి..



రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకోని రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. గ్రావెల్ రోడ్డు బీటీగా అభివృద్ధి చెందితే ఒక్క రైతులు మాత్రం కాకుండా పలు వర్గాల ప్రజలు లబ్ధిపొందుతారు. కావున అధికారులు సమన్వయంతో పనిచేసి శరవేగంగా రోడ్డు పనులను ముగించాలి.

– గుడిమెట్ల సుబ్బిరెడ్డి, ముసలిమడుగు

ప్రజల వద్దకే ఆర్టీసీ సేవలు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం దేవదానం

ఎర్రుపాలెం: ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మధిర ఆర్టీసీ డీఎం దేవదానం అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమన్నారు. జూన్ 30 వరకు వివాహ శుభ కార్యాలకు, విహారయాత్రలకు 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. పదో తరగతి వరకు బాలికలకు టీఎస్‌ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అందరూ ఆర్టీసీ ఆదరించి లాభాల బాటలో నడిపించాలన్నారు. ప్రయాణికులు పలు సమస్యలను డీఎం దృష్టికి తీసుకురాగా.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, కేవీరెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతులకు పరిహారం అందించాలి



ఎండిపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న సర్పంచ్ తిరుపతిరావు

బోనకల్: ఎండిపోయిన మొక్కజొన్నను గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించాలని ఆళ్లపాడు సర్పంచ్ మర్రి తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి భూములకు నీరందక మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఆళ్లపాడు మొక్కజొన్న పంటలను రైతులతో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరిగేషన్ అధికారులు బీబీసీకి సక్రమంగా నీటి విడుదల మక్క పంట కంకి దశలో ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారబందీ విధానం తమకు శాపంగా మారిందన్నారు. పంటకు నీరందక వేలాదిరూపాయల పెట్టుబడులు నీరుగారిపోయాయన్నారు. కావున అధికారులు వ్యవసాయాధికారులతో సర్వే చేయించి నీరందక నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నాగేశ్వరరావు, వీరబాబు, రమణ, వెంకటకృష్ణ, అంకురాజు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి జన్మదిన వేడుకలు



శశిరేఖరెడ్డికి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

చింతకాని: మండలంలోని నాగిలిగొండ గ్రామంలో శతాధిక వృద్ధురాలు జమ్ముల శశిరేఖరెడ్డి జన్మదిన వేడుకలను ఆమె కుటుంబసభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శశిరేఖరెడ్డికి ముగ్గురు కుమారులు, కుమార్తెతో పాటు దేశ, విదేశాల్లో స్థిరపడిన నాలుగు తరాలకు చెందిన మనుమళ్లు, మనుమరాళ్లు, మునిమనుమళ్లు, మనుమరాళ్లు మొత్తం 25 మంది బంధుమిత్రులు, గ్రామపెద్దల మధ్య ఆమె కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.



సిద్ధారంరోడ్‌లో పశువుల ఆస్పత్రి ఎదురుగా ప్రమాదకరంగా మారిన గొయ్యి..

ఆదమరిస్తే అంతే సంగతులు..

సత్తుపల్లిరూరల్: రోజుకు వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు పక్కన పెద్దగుంతను తవ్వి.. మట్టి దిబ్బను అలాగే నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదమరిస్తే ఇక అంతే సంగతులు.. పట్టణంలోని సిద్ధారం రోడ్‌లో పశువుల ఆస్పత్రికి ఎదురుగా మంచినీటి పైపులైన్ కోసం వారంరోజుల క్రితం పెద్ద గుంతను తవ్వి అలాగే వదిలేశారు.. మట్టిదిబ్బ సైతం అలాగే ఉంది. దీంతో ద్విచక్రవాహన దారులు, ప్రయాణికులు రాత్రి వేళల్లో కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిని పూడ్చివేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

లేగదూడపై వీధి కుక్క దాడి

చింతకాని: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో పండగ నాగయ్యకు చెందిన లేగదూడను వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ప్రజలతో పాటు మూగజీవాలపై కూడా దాడి చేసి గాయపరుస్తున్నాయని బాధితుడు తెలిపాడు. వీధి కుక్కల బెడదను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గీతా మందిరంలో భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలో గల శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో శనివారం ప్రముఖ న్యాయవ్యాధి పిన్నం జానకీరామారావు, విజయలక్ష్మి దంపతులు, ఈడా నాగేశ్వరరావు, సుశీల, జంగాల సూర్యనారాయణ, మంగతయారు దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, ఏపూరి పురుషోత్తమరావు, ఏవి శేషాచార్యులు, రాఘవయ్య పాల్గొన్నారు.

5న ‘చలో ఢిల్లీ’



ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఏన్కూరు: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు కోరారు. మండలంలోని రాయమాదారంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. దేశానికి వెన్నుముక రైతు అని చెబుతుందే తప్ప రైతుల బాధలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాలసాని వీరన్న, రాము, కొండ, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో శ్రీఅంకమ్మతల్లి, మద్దిరావమ్మ, శ్రీమహాలక్ష్మీ, నాగేంద్రస్వామి, పెద్దమ్మతల్లి దేవాలయంలో శనివారం రాత్రి జాతర సందర్భంగా మహిళలు దీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యగారిపల్లి, కమలాపురం గ్రామాల మహిళలు ఆలయంలో పూజలు నిర్వహించి, దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘కల్యాణలక్ష్మి’ పేదలకు వరం



కొణిజర్ల: లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

కొణిజర్ల/కారేపల్లి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపడుచులకు వరమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. శనివారం కొణిజర్ల మండలంలోని పలు గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.72,08,852 లక్షలు, కారేపల్లిలోని వైఎస్ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వారికి అందించారు. తహసీల్దార్ దొడ్డారపు సైదులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కేంద్రం సహకరించక పోయినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగకుండా కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం ముందుకు వెళుతున్నారన్నారు. అనంతరం కారేపల్లిలోని భరత్‌నగర్ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన గంగుల గురప్ప మృతదేహానికి నివాళులర్పించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కారేపల్లికి చెందిన గుడిపూడి నాగేశ్వరరావును, సూర్యతండాలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆంగోతు ఠాగూర్ కుమార్తెను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు కవిత, సొసైటీ చైర్మన్ రవి, ఎంపీడీఓ ఆర్.రమాదేవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఉమాశంకర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలి



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు

సత్తుపల్లి: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. శనివారం సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మకు మహిళలతో కలిసి శవయాత్ర నిర్వహించి.. పోస్టాఫీస్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ సాంప్రదాయంలో మహిళలకు పవిత్రమైన పాత్ర ఉందని.. మహిళల హక్కుల కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితను చూసి ఓర్వలేక కేంద్ర ప్రభుత్వం ఈడీ పేరుతో అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షుడు ఎస్‌కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, మోరంపూడి ప్రభాకర్, గ్రాండ్ మౌలాలీ, కొత్తూరు ఉమామహేశ్వరరావు, గొర్ల సంజీవరెడ్డి, శ్రీనివాసరావు, అంకమరాజు, మట్టా ప్రసాద్, పవన్, మాధురి మధు, రఘు, కంటే నాగలక్ష్మి, మల్లూరు పద్మావతి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వైరా మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

వైరా: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు మరింత ముందడుగు వేసి అభివృద్ధి పథంలోకి నడవాలన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సోఫియా, హెచ్ఎం సిస్టర్ రాజపుష్పం, సిస్టర్ డీనియా, సిస్టర్ సుశీల, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారుతున్న వెంకటగిరి రూపురేఖలు



రహదారుల రూపకల్పనతో రూపుదిద్దుకుంటున్న వెంకటగిరి

ముదిగొండ: ఖమ్మంకు కూతవేటు దూరంలో ఉన్న వెంకటగిరి జంక్షన్‌లో అన్ని రూపురేఖలు మారుతున్నాయి. మూడు జాతీయ రహదారుల వలయంగా రానున్న కాలంలో మారుతున్న తరుణంలో ఖమ్మం పట్టణాన్ని తలపిస్తోంది. ఒకప్పుడు ఎర్రబస్ కూడా ఆగని ఆ కూడలిలో అన్ని సౌకర్యాలు ఏర్పాడుతున్నాయి. నూతన భవనాలు, వివిధ వ్యాపార సంస్థలు అందరికి అందుబాటులో ఉన్నాయి. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అడ్డాగా వెంకటగిరి పేరొందింది. నేషనల్‌హైవే పనులు త్వరితగతిన సాగుతున్న నేపథ్యంలో వెంకటగిరి ప్రధాన కూడలిలో రంగుల రంగుల బిల్డింగ్‌లు వెలుస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉంటోంది. సిటీ కల్చర్ వచ్చేసింది. రహదారుల రూపకల్పనతో వెంకటగిరి, ముదిగొండ రానున్న రోజుల్లో ఖమ్మం పట్టణంలో కలిసిపోనుంది.

భవిష్యత్‌కు విద్యార్థి దశే కీలకం

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు వీడ్కోలు, వార్షికోత్సవ వేడుకలు

భరత్ కిడ్స్, టెక్నో స్కూల్‌లో..




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శీలం విద్యాలత

మధిర: విద్యార్థులు కష్టపడి చదువుతూ విద్యాభివృద్ధిని సాధించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. మధిర వర్తక సంఘంలో భరత్ కిడ్స్, టెక్నో స్కూల్ వీడ్కోలు, 30వ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ విద్యాసంస్థల డైరెక్టర్ శీలం విద్యాలత జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శ్రీనిధి జూనియర్ కళాశాలలో..

మధిరలోని రెడ్డి గార్డెన్‌లో శనివారం శ్రీనిధి కళాశాల జూనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కళాశాలలో చదివి ఉద్యోగులుగా స్థిరపడిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అంజనబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్రివేణి టాలెంట్ స్కూల్‌లో.. వార్షికోత్సవం..



త్రివేణి పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న వెంకటాచారి

సత్తుపల్లి: బంగారు బవిష్యత్తుకు విద్యార్థి దశ పునాది వంటిదని సింగరేణి జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.వెంకటాచారి అన్నారు. స్థానిక త్రివేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన వేడుకలకు ఆయనతో పాటు ప్రముఖ అర్థోపెడిక్ వైద్యుడు గండికోట రమాకాంత్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి సంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్, పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల వేణుగోపాల్, ఇన్‌చార్జ్ వంశీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఠాగూర్ విద్యాసంస్థల వార్షికోత్సవం..



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

వైరా: వైరా మున్సిపాలిటీలోని ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాల ఠాగూర్ విద్యాలయంలో శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత, వైరా ఎంపీపీ శంకర్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం కళాశాల నుంచి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాపికలు బహుకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మోటివేటర్ తాటిపల్లి సుధీర్, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, చైర్మన్ సంక్రాంతి సునీత, డైరెక్టర్ సంయోగిత, ప్రిన్సిపల్ కృష్ణారావు, ఎస్ఎస్ఎస్ పీఓ లింగారావు, జేవీవీ జిల్లా నాయకులు రామకృష్ణ, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు..

ఎర్రుపాలెం: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలన్నారు. చదువుతోనే మంచి గుర్తింపు వస్తుందన్నారు. దేశ మరియు సమాజాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి అప్పారావు, పాఠశాల సూపరింటెండెంట్ కె.సరిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.